కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులు

మహా శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

ఏర్పాట్లు చేసిన అధికారులు

రామప్ప ఆలయంలో చేసిన ఏర్పాట్లు

వెంకటాపూర్/ మహదేవపూర్ (కాళేశ్వరం)/ గణపురం, ఫిబ్రవరి 25 : మహా శివరాత్రిని పురస్కరించుకొని రామప్ప, కాళేశ్వరం, కోటగుళ్లు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో ఏర్పాట్లను మంగళవారం అధికారులు పరిశీలించారు. రామప్పలో నేటి నుంచి మూడు రోజుల పాటు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అత్యంతవైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. క్యూలైన్, లైటింగ్ ఏర్పాటు పనులను పూర్తి చేశారు.శివపార్వతుల కల్యాణం, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి సుమారు 50 వేల మంది ప్రతి సంవత్సరం వస్తారు. 300 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు డీఎస్పీ రవీందర్ తెలిపారు. కాళేశ్వర ముక్తీశ్వర క్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించే శివరాత్రి వేడుకలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం గణపతి పూజ, దేవతారాధన,నవగ్రహ అగ్ని ప్రతిష్ట, ఊరేగింపు చేశారు. కన్నుల పండువగా స్వామి వారి ఎదుర్కోలు సేవ నిర్వహించారు. మహత్తర ఘట్టాన్ని భక్తులు వీక్షించేందుకు ఆలయ అధికారులు పలు చోట్ల ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలను చెందిన భక్తులు అధిక సంఖ్యలో కాళేశ్వరముక్తీశ్వర క్షేత్రానికి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మహేశ్, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలిపోయిన మామిడి తోట వద్ద రోదిస్తున్న రైతు ఎర్రయ్య

మామిడి తోట దగ్ధం : రూ.4 లక్షల నష్టం

తాడ్వాయి, ఫిబ్రవరి 25 : గుర్తుతెలియని వ్యక్తులు మంటలు పెట్టడంతో మండలంలోని ఒడ్డుగూడెంకు చెందిన గిరిజన రైతుకు చెందిన నాలుగు ఎకరాల మామిడి తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఎర్రయ్య ఐదెకరాల భూమిలో 2021లో నాబార్డు వారి ఆర్థిక సహకారంతో మామిడి తోటను సాగు చేస్తున్నాడు. సుమారు 400 మొక్కలు నాటి కుటుంబంతో సహా తోట వద్ద ఉంచి చెట్లను కాపాడుకుంటున్నారు. సోమవారం రాత్రి ఎర్రయ్య ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మామిడి తోటలో మంటలు పెట్టడంతో మొత్తం కాలి బూడిదైంది. మంగళవారం ఉదయం తోట వద్దకు వచ్చిన ఎర్రయ్య దానిని చూసి లబోదిబోమన్నాడు. తోటతో పాటు 300 మీటర్ల పైపులు, సోలార్ ఫెన్సింగ్ పూర్తిగా కాలిపోయింది. నిరుపేద రైతు ఎర్రయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

మహదేవపూర్, ఫిబ్రవరి 25 : వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఇసుక లారీ ఢీకొట్టిన ఘటన మండలంలోని బొమ్మాపూర్ ఎల్‌టీ రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ వ్యవసాయ కూలీలను ఎక్కించుకొని ఎల్‌టీ రోడ్డుపైకి వస్తుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ముందు భాగంగా ధ్వంసం కాగా, ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మితిమీరిన వేగంతో ఇసుక లారీలు రావడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని కూలీలు లారీలను అడ్డుకున్నారు. డ్రైవర్లతో తీవ్ర వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. రహదారిపై ఇష్టారాజ్యంగా లారీలను పార్క్ చేయడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లారీ డ్రైవర్ల ఆగడాలను అరికట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- **భూపాలపల్లి జిల్లాలో 412 మంది, ములుగు జిల్లాలో 628 మంది ఓటర్లు**
- **జయశంకర్ జిల్లాలోని ఐదు మండలాల్లో గ్రాడ్యుయేట్ ఎన్నికలు**
- **2483 మంది ఓటర్లు**

పోలింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

జయశంకర్ భూపాలపల్లి/ ములుగు, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని 12 మండలాల్లో అధికారులు 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బందిని నియమించారు. అయితే మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, కాటారం, పలిమెల మండలాల్లో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకోసం ఐదు మండలాల్లో అదనంగా ప్రతి మండలానికి మరో పోలింగ్ స్టేషన్, సిబ్బందిని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 412 మంది ఓటర్లు ఉండగా, ఐదు మండలాల్లో గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు 2483 మంది ఓటర్లు ఉన్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మండలాల వారీగా ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లాలో 412 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఉండగా, ఇందులో 279 మంది పురుషులు, 133 మంది మహిళలు ఉన్నారు. భూపాలపల్లి మండలంలో 118, మొగుళ్లపల్లి 31, చిట్యాల 45, గణపురం 59, రేగొండ 37, టేకుమట్ల 14, గోరికొత్తపల్లి 25, మహదేవపూర్ 14, మహాముత్తారం 26, మల్హర్ 2, కాటారం 40, పలిమెల మండలంలో ఒక ఓటరు ఉన్నారు.

2,483 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

మంథని నియోజకవర్గానికి చెందిన మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, కాటారం, పలిమెల మండలాల్లో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2,483 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 1,734 మంది పురుషులు, 749 మంది మహిళలు ఉన్నారు. మహదేవ్‌పూర్ మండలంలో 611, మహాముత్తారం 373, మల్హర్ 584, కాటారం 877, పలిమెల మండలంలో 38 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, ఈ ఐదు మండలాల్లో ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ స్టేషన్లతో పాటు పక్కనే మరో పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.

ఓటర్లకు ఎర షురూ

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు వారికి కావాల్సినవి సమకూరుస్తున్నారు. లిస్టు ప్రకారం ఓటర్లకు ఫోన్ చేసి సమయం తీసుకుంటున్నారు. బుధవారం ఉదయం నుంచి పంపకాలు ప్రారంభం కానున్నాయి. ఈ సారి ఉపాధ్యాయ ఎన్నికల్లో ప్రైవేట్ విద్యా సంస్థల వారికి అవకాశం ఇవ్వడంతో వాళ్ల డిమాండ్ పెరిగిపోయింది. గ్రాడ్యుయేట్‌లకు రూ.3 వేలు, ఉపాధ్యాయ ఓటర్లకు రూ.5 వేలు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఏఎస్పీ

మంగపేట : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. స్థానిక బూత్‌లెవల్ అధికారులను ఓటర్ల సంఖ్య తదితర వివరాలు తెలుసుకొని సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై సూరి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ములుగు జిల్లాలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలు

ములుగు జిల్లాలో 628 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, ఇందుకు తొమ్మిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించడంతో పాటు మరో 20 శాతం మంది అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన ఓటర్లకు సూచించారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 200 మంది పోలీసులకు విధులు కేటాయించి 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరు రూట్లలో నాలుగు ఫ్లైకింగ్ ఫోర్స్ బృందాలను, 2 స్పెషల్ ఫ్లైకింగ్ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసివేయించామని, ఈ నెల 28 సాయంత్రం 4గంటల వరకు బంద్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను అమర్చినట్లు తెలిపారు.

వేసవిలో నిరంతర విద్యుత్ అందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



33/11 కేవీ ఫీడర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 25 : వేసవిలో అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ జిల్లా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా ఇన్ పుట్, ఔట్ పుట్, ట్రాన్స్ ఫార్మర్లు, ఫీడర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతుందని, దానికి అనుగుణంగా సరఫరా చేయాలని ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్లు, లైన్లు, ఇతర సాంకేతిక పరంగా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. అదనపు ట్రాన్స్ ఫార్మర్లు సిద్ధంగా ఉంచడం, లోడ్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం వంటి చర్యలు అమలు చేయాలన్నారు. ఉప విద్యుత్ కేంద్రాలు, నూతన పోల్స్ ఏర్పాటుకు అవసరమైన అటవీ భూముల కోసం 28న విద్యుత్, అటవీ అధికారులతో సమావేశం నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 33/11 కేవీ ఉప విద్యుత్ కేంద్రాలు 48 ఉన్నాయని, వాటి పరిధిలో ప్రతి రోజు విద్యుత్ వినియోగం నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ, పారిశ్రామిక, గృహ వినియోగదారులకు అంతరాయం లేకుండా 24 గంటలు సరఫరా ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ మల్చూర్ నాయక్, డీఈ పాపిరెడ్డి, టెక్నికల్ డీఈ వెంకటేశం, ఆపరేషన్ ఈడీఈ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక సాధికారతతోనే దేశాభివృద్ధి

భూపాలపల్లి రూరల్ : మహిళా ఆర్థిక సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ మహిళా సాధికారత పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఆర్థిక ప్రగతి కనబడాలంటే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పొదుపును పాటించాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి తిరుపతి, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన వేడుకలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 25 : మండలకేంద్రంలోని నార్త్ మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధన చేశారు. వేడుకల్లో హెచ్ఎం రాజశేఖర్, రమాదేవి, రాంబాబు, సారంగపాణి, వరలక్ష్మి, భిక్షపతి పాల్గొన్నారు.

ఆర్థిక పాదుపు పాటించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 25 :మహిళలు ఆర్థిక క్రమ శిక్షణ పాటించినప్పుడు కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ మహిళలు పొదుపును అలవాటు చేసుకోవాలని కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రేణుక, మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ ఫాతిమా, ఎన్ఎస్ఎస్ సంధానకర్త నవీన్, అధ్యాపకులు వెంకటయ్య, జ్యోతి, సంపత్, రమేశ్, భాస్కర్, శేఖర్, మున్నీ, సుమలత, జీవవేణి పాల్గొన్నారు.

ఫాస్టాగ్ మినహాయింపు కోసం ఆర్‌సీ, ఆధార్ కార్డులు అందజేయాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 25 : త్వరలో ఏటూరునాగారంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఫాస్టాగ్ చెక్ పోస్టు ప్రారంభించనున్నందున స్థానికుల వాహనాలకు మినహాయింపు ఇవ్వనున్నట్లు ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రెహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏటూరునాగారం వాహన యాజమానులు తమ వాహన ఆర్‌సీ, ఆధార్ కార్డుతో సాఫ్ట్ రేంజ్ విభాగంలో సంప్రదించాలని తెలిపారు. స్థానికులు ఫాస్టాగ్ వద్ద ఆగకుండా నేరుగా వెళ్లిపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఫాస్టాగ్ వద్ద వాహనాలు ఆగితే ఆటోలు, ద్విచక్రవాహనాలు, అంబులెన్స్‌లు పక్క నుంచి వెళ్లేందుకు ప్రత్యేకంగా కొద్ది దూరం వరకు డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. పనులు సైతం జరుగుతున్నాయి.

ఇంటి నంబర్లు కేటాయించాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 25: జిల్లాకేంద్రంలోని సర్వే నంబర్ 280లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న భగత్‌సింగ్ కాలనీ వాసులకు ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పేదలు గుడిసెలకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇంటి నంబర్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు క్యాతారాజు సతీశ్, గురిజెల సుధాకర్‌రెడ్డి, నేరెళ్ల జోసెఫ్, గడ్డం సింహాద్రి, గోనెల తిరుపతి, పొనగంటి లావణ్య, లావణ్య పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందిస్తున్న వర్తక సంఘం నాయకులు

బాధితుడికి రూ.96,300 అందజేత

గోవిందరావుపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని పస్రాలో బోళ అశోక్‌కు చెందిన కిరాణా షాపు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోగా మంగళవారం వర్తక సంఘం ఆధ్వర్యంలో బాధితుడికి రూ.96,300 అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బూర నరేందర్, కిరాణా సంఘం నాయకులు శ్రీకాంత్, కరుణాకర్‌రెడ్డి, అడువర్ల రాజమల్లు, రాజేందర్‌రెడ్డి, తిప్పర్తి నరసింహాచారి, మునీర్, బాషా, నాగరాజు, సురేశ్, బచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

కాటారం, ఫిబ్రవరి 25 : మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న మహిళను సఖీ సెంటర్ నిర్వాహకులు చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు. మల్హర్ మండలం కొండంపేట గ్రామ పరిధిలో మంగళవారం ఒంటిపై బట్టలు లేకుండా తిరుగుతున్న మహిళను చూసి రాజబాబు అనే వ్యక్తి హెల్ప్ లైన్ 181 నంబర్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే మహదేవపూర్ సీడీపీవో రాధిక, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి సహాయంతో మహిళను సఖీ సెంటర్‌కు తరలించారు. మహిళకు స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగి వివరాలు ఆరా తీశారు. కాటారానికి చెందిన అంకూస్ కుమార్తె సంధ్యారాణి అని తెలియడంతో వెంటనే స్థానిక ఎస్సై అభినవ్ సహాయంతో ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రి తెలిపారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి యువతిని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ కేస్ వర్కర్ సరిత, మల్టీపర్పస్ సుమలత, సెక్యూరిటీ తిరుపతి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సఖీ సెంటర్ నిర్వాహకులు

ఎరువుల కొరత రాకుండా చూడాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 25: జిల్లాలో ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని రాం సాయి ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్, జంగేడులోని సహకార సంఘం ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి రైతుల అవసరాలకు తగినంత నిల్వలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 1,950 టన్నుల యూరియా డీలర్లు దగ్గర, 650 టన్నులు మార్క్‌ఫెడ్ వద్ద అందుబాటులో ఉందన్నారు. వారం రోజుల్లో అదనంగా 2 వేల టన్నులు రానునట్లు తెలిపారు. ఎరువుల సరఫరా ఆధార్ నమోదు ప్రకారం మాత్రమే జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారీ విక్రయాలను సమీక్షించి, అవసరాన్ని బట్టి ఎరువుల కేటాయింపులు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ టీములు ఎరువుల దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. ఆయన వెంట డీఏవో విజయభాస్కర్, భూపాలపల్లి మండల వ్యవసాయాధికారి సతీశ్, సిబ్బంది ఉన్నారు.

సమ్మక్క బరాజ్ మరో గేటు ఎత్తి నీటి విడుదల

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 25 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద మంగళవారం మరో గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్ వద్ద పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లుగా ఉండాల్సింది. ఎగువ నుంచి బరాజ్‌లోకి 2350 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రస్తుతానికి బరాజ్ వద్ద నీటిమట్టం 78.70 మీటర్ల దిగువకు పడిపోయింది. రెండు గేట్ల ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, రాత్రికి ఒక గేటు బంద్ చేయనున్నట్లు సమాచారం. బరాజ్ ఎగువన ఉన్న దేవాదుల ఎత్తిపోతలో నీటి పంపింగ్ కొనసాగుతోంది. రోజుకు ఐదు మోటర్ల ద్వారా 1,414 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు ఏఈఈ సాయిరాం, డీఈ శరత్ తెలిపారు.

రామప్పకు ప్రత్యేక బస్సులు

ములుగురూరల్/ వెంకటాపూర్, ఫిబ్రవరి 25 : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ములుగు నుంచి రామప్పకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు వరంగల్-2డిపో మేనేజర్ జ్యోత్స్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ములుగు నుంచి, హనుమకొండ నుంచి ప్రతి గంటకు ఒక బస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తుల రద్దీని బట్టి మరిన్ని బస్సులను నడిపించేందుకుఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్హర్, ఫిబ్రవరి 25 : ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శ్రీజ అన్నారు. మంగళవారం మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో ఎరువులు, పురుగుల మందు డీలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొనుగోలు చేసిన మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు పురుగు మందు తీసుకుంటేనే డీలర్లు యూరియాను విక్రయిస్తున్నారని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్వీ, శిరీష, అనూష పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 25: తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును మార్చి 10 వరకు పొడిగించినట్లు డీఈవో రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలతో పాటుగా 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఆరో తరగతిలో వంద సీట్లు ఉన్నాయని, ఓసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్,పీహెచ్సీ విద్యార్థులకు రూ.125గా నిర్ణయించినట్లు చెప్పారు.

మహిళ లకు ఆరోగ్య పరీక్షలు

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 25 : మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహారెడ్డి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి ప్రభుత్వ దవాఖానకు పరీక్షల నిమిత్తం పంపించారు. మొత్తం 86 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఆమె వివరించారు. వైద్య సిబ్బంది యాకలక్ష్మి ఉన్నారు.

వేతన సెటిల్‌మెంట్‌కు పోరాటాలు చేయాలి

మంగపేట, ఫిబ్రవరి 25 : కమలాపురం బిల్ట్ కార్మికులు వేతన సెటిల్‌మెంట్ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్ టీయూ(న్యూ) అధ్యక్షుడు గుర్రం విజయ్‌కుమార్, ఏఐకేఎంకేఎఫ్ నాయకుడు రెడెండ్ల మోహన్‌రెడ్డి, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, రైతు కూలీ సంఘం ములుగు జిల్లా నాయకుడు పల్లెబోయిన స్వామి పిలుపునిచ్చారు. పంచాయతీ ఆవరణలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. 1979లో స్థాపించిన బిల్ట్ పరిశ్రమ ప్రత్యక్షంగా పరోక్షంగా పదివేల మందికి జీవనోపాధిని కల్పించిందన్నారు. 2014లో ఎలాంటి లాకౌట్ ప్రకటించకుండా పరిశ్రమను మూసివేయడంతో వందలాది మంది కార్మికులు వీధిన పడ్డారన్నారు. తమకు రవాల్సిన వేతన బకాయిల కోసం కార్మికులు అనేక ఆందోళనలు చేసినా యాజమాన్యం న్యాయం చేయలేదన్నారు. లేబర్ కోర్టు తీర్పును కూడా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం కూడా కార్మికులను విస్మరించి యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల పొట్టగొట్టినట్లు ఆరోపించారు. ఇదే అదనుగా భావించిన యాజమాన్యం పరిశ్రమ భూములను ఇతర కంపెనీకి అమ్మేసి చేతులు దులుపుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ కార్మికులు గూడ యాదగిరి, పంజాల సత్యనారాయణ, వెంకటరామరాజు, మల్లేశం, ఐలయ్య, స్వామి, కృష్ణ, శ్రీనివాస్, 200 మంది పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం : ఎస్సై

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 25 : క్రీడలు ఆడడం వల్ల ఆరోగ్యం, దృఢంగా తయారవుతారని ఎస్సై రమేశ్ అన్నారు. భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో జిల్లా లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 24, 25వ తేదీల్లో నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రమణారావు, ఎస్సై రమేశ్ హాజరై గెలుపొందిన వారికి బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఆటల్లో గెలుపోటములు సహజమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామ్‌చందర్, శ్రీనివాస్, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్స్ సురేశ్, భిక్షపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటారంలో పదో తరగతి ప్రతిభా పరీక్ష

కాటారం, ఫిబ్రవరి 25 : ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కాటారంలో మంగళవారం పదో తరగతి ప్రతిభా పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం లక్ష్యంగా గంగారం మోడల్ స్కూల్, గంగారం హైస్కూల్ విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు సంఘం మండల అధ్యక్షుడు సాగర్ తెలిపారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి మానసిక ధైర్యం నింపడానికే పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్, కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదు

కాటారం,